క్లుప్తంగా

ముస్లింలకు ఇఫ్తార్ విందు

నడిగూడెం : మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు పందిటి క్రాంతి ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నెల రోజుల పాటు ముస్లింలు ఈ రంజాన్ మాసంలో ఎన్నో నియమ నిబంధనలు పాటిస్తుంటారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతుల ఆంజనేయులు, బోనగిరి ఉపేందర్, దున్నా ప్రవీణ్, మేకల వీరబాబు, గుండు శ్రీను, ముస్లిం పెద్దలు ఎండీ అఫ్జల్, ఖలీల్ అహ్మద్, మౌలానా, జలీల్, బుడేమియా, తదితరులు పాల్గొన్నారు.

కాల్వ కట్టపై పారిన నీరు



రత్నవరం వద్ద కొత్తగూడెం మేజరు కాల్వ కట్టపై పొంగి పొర్లుతున్న నీరు

నడిగూడెం : మండలంలోని రత్నవరం వద్ద సాగర్ ఎడమకాల్వకు అనుబంధంగా ఉన్న కొత్తగూడెం మేజరుకాల్వలో గురువారం నీరు అధికంగా రావడంతో కట్టపై పొంగి పారింది. ఆ ప్రాంతంలో కట్ట బలహీనంగా ఉండడంతో నీరు కట్ట పైనుంచి ప్రవహించింది. దీంతో నీరు కాల్వ కింద ఉన్న పొలాల్లోకి వెళ్లింది. ఆ ప్రాంత రైతులు సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు, సిబ్బందికి చెప్పడంతో అప్రమత్తమై చాకిరాల వద్ద ఉన్న తూము దగ్గర నీటి సరఫరా తగ్గించారు. అధికారులు అప్రమత్తం కాకపోతే గండిపడి ఆ ప్రాంతంలో పొలాలు నీట మునిగే ప్రమాదం ఉండేదని స్థానిక రైతులు తెలిపారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన హృతిక్, నవీన్‌కుమార్

కోదాడరూరల్ : భారత కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో గురువారం నిర్వహించిన ఫిట్ ఇండియా క్విజ్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజ విద్యాలయ విద్యార్థులు పల్లా హృతిక్, కొండ్రు నవీన్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 4వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. 4వ స్థానంలో నిలిచిన విజేతలు రూ.5లక్షల నగదు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

గరిమెళ్లకు ఘన నివాళి



గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

నేరేడుచర్ల : తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య ప్రాజెక్టు ఆస్థాన గాయకుడు, ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం మండల కేంద్రంలో అన్నమయ్య బావవాహినులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొణతం సత్యనారాయణరెడ్డి, సుంకరి క్రాంతికుమార్, ఉపాధ్యాయులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, బికోజీ, రాంమ్మూర్తి, బాలు, చంద్రయ్య, కృష్ణయ్య, హుస్సేన్, తదితరులున్నారు.

గ్రూపు-1లో శ్రావ్యకు 516 మార్కులు



మునగాల : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూపు–1ఫలితాలలో మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన మేడం సుజాత -వెంకన్నల కుమార్తె శ్రావ్య 516.5మార్కులు సాధించింది. దీంతో శ్రావ్యను గురువారం పలువురు నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

హోలి ప్రశాంతంగా జరుపుకోవాలి

హుజూర్‌నగర్ : హోలి వేడుకను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎదుటివారికి ఇబ్బంది కలిగించొద్దని సీఐ చరమందరాజు గురువారం తెలిపారు. వేడుకలో మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, యువత ప్రమాదాలకు గురికాకుండా ఆదర్శంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

లాలీతండాలో హోలి సంబరాలు

మఠంపల్లి : మండలంలోని లాలీతండాలో గురువారం గిరిజనులు, యువకులు ముందస్తుగా హోలి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకుని సంబరాలు చేశారు. కార్యక్రమంలో తండా పెద్దలు రమేష్‌నాయక్, బాలునాయక్, వశ్యానాయక్, నరసింహ, రవీందర్, వెంకీ, గోపి, శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరిన బాలికల హాస్టల్
- వృథా అయిన రూ.30లక్షల నిధులు
- అద్దెభవనాల్లో కొనసాగుతున్న వసతిగృహం



నిర్మించి వినియోగించకుండా వదిలేసిన బాలికల వసతిగృహం



హాస్టల్ లోపల పాత సామగ్రి, ట్రాక్టర్లను ఉంచిన స్థానికులు

కోదాడ : ప్రభుత్వం బాలికలకు ప్రత్యేక వసతిగృహాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పక్కా భవనాన్ని సంవత్సరాల తరబడి ఉపయోగించకపోవడంతో అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో ఇదే అదునుగా కొందరు స్థానికులు తమ పాత సామాన్లను దాచుకోవడానికి వసతిగా మారింది. ఉన్న భవనాన్ని నిర్వహణలోకి తీసుకురాకుండా బాలికల వసతిగృహాలను రూ.లక్షలు అద్దెలు చెల్లించి ప్రైవేట్ భవనాల్లో నడుపుతున్నారు. ప్రభుత్వాలు మారిన, అధికారులు మారుతున్నా ఆ భవనం పరిస్థితి మాత్రం మారడం లేదు. ఆ వైపుగా ఆలోచన చేసే వారు కరువయ్యారు.

రూ.30లక్షల యూజీసీ నిధులు..

కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో ఉన్న కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు పొందడంతో యూజీసీ కళాశాలలో చదువుకొనే బాలికల కోసం వసతిగృహాన్ని మంజూరు చేసింది. అందుకు ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు కూడా కేటాయించింది. దీంతో ఆ నిధులతో కళాశాల సమీపంలో దాదాపు 150మంది బాలికలు ఉండే విధంగా ఓ భవనాన్ని నిర్మాణం చేశారు. భవన నిర్మాణ సమయంలో కళాశాలకు సంబంధించిన వారుగాని, అధికారులు గాని కనీస ఆలోచన లేకుండా భవనం నిర్మించడంతో అందులో ఉండేందుకు బాలికలు ముందుకు రాలేదు. కళాశాలకు చెందిన కొంత మంది ప్రిన్సిపాల్స్ ఈ భవనాన్ని ఉపయోగించాలని పరిశీలించారు. ఆ భవనంలో బాలికలకు సరైన రక్షణ లేదని అక్కడకు రావడానికి ఒప్పుకోలేదు. దీంతో చేసేదిలేక గత ప్రిన్సిపాల్ ఆభవనంలో పీజీ తరగతులు నిర్వహించాలని చూసిన విద్యార్థులు రాకపోవడంతో పట్టించుకోలేదు.

ప్లానింగ్ లేకుండా నిర్మాణం..

బాలికల వసతిగృహ నిర్మాణ సమయంలో అధికారులు చేసిన తప్పిదం ఈ భవనానికి శాపంగా మారింది. కళాశాలకు 40ఎకరాల విస్తీర్ణంలో భూములు ఉన్నాయి. కాని అధికారులు మాత్రం బాలికల వసతిగృహాన్ని రోడ్డుమీద కట్టారు. బాలికల వసతిగృహాన్ని నిర్మించే సమయంలో భవనానికి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంటుంది. కాని తగు రక్షణ లేకుండా నిర్మాణం చేపట్టారు. వసతిగృహం పడమర వైపుకు రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డు వైపు ప్రహరీ నిర్మాణానికి స్థలాన్ని వదలకుండా రోడ్డు వైపే కిటికీలు వచ్చే విధంగా నిర్మాణం చేయడంతో రోడ్డున వెళ్లే వారికి గదుల్లో ఉన్న బాలికలు కనిపిస్తున్నారు. అంతే కాకుండా పడమర వైపు ప్రహరీ లేకపోవడంతో పోకిరీలు కిటికీల్లో నుంచి చూస్తూ ఇతర చిల్లర చేష్టలు చేస్తారనే భయంతో బాలికలు అక్కడ ఉండేందుకు ఇష్టపడడం లేదు. ఆ భవనానికి ప్రహరీ నిర్మించాలంటే రోడ్డు మార్జిన్ కూడా లేదు, దీంతో ఈ భవనం ఎలా ఉపయోగించాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రోడ్డు వైపు ఉన్న కిటికీలను పూర్తిగా మూసివేసి లోపలి వైపు విశాలమైన కిటికీలను ఏర్పాటు చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కుట్టుమిషన్ శిక్షణలో పాల్గొన్న సభ్యులు

హుజూర్‌నగర్ : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఐకేపీ డీపీఎం ఆంజనేయులు అన్నారు. గురువారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఏకరూప దుస్తుల కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆరు మండలాల సమభావన సంఘాల సభ్యుల నుంచి ఆరుగురు చొప్పున ఎంపిక చేసి వారికి డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను ఉపయోగించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఎం స్వరూపారాణి, సీసీలు పరిమళరాణి, నవ్య శిక్షకులు, ఆయా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులతో మాక్ డ్రిల్ చేయిస్తున్న సిబ్బంది

గరిడేపల్లి : అగ్ని ప్రమాదాల నియంత్రణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో హుజూర్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పొగతాగడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, వంట గ్యాస్ లీకేజీల వల్ల ప్రమాదాలు జరుగతాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి పడకుండా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అందుబాటులో ఉన్న పరికరాలను ఎలా వినియోగించాలో విద్యార్థులతో స్వయంగా డ్రిల్ చేయించారు. అలాగే అగ్నిని నియంత్రించడం తమను కాపాడుకోవడంతో పాటు ఇతరలను రక్షించడంపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రవిబాబు, ప్రశాంత్, నగేష్, నరసింహారావు, ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కార్యవర్గ సభ్యుడు కొప్పొజు సూర్యనారాయణ ఆరోపించారు. గురువారం చింతలపాలెం మండలంలోని మల్లారెడ్డిగూడెంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభను అంబటి లింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేటు సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. గతంలో ఢిల్లీలో రైతులు ఆందోళన చేయడంతో నల్లచట్టాలను రద్దు చేస్తామని చెప్పి మరల వాటిని దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. రాష్ట్రంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి క్వింటాల్‌కు రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చింత్రియాల రవి, మాజీ సర్పంచ్ గోనె లక్ష్మీఅంకయ్య, మంగయ్య, కృష్ణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్ష



నేరేడుచర్లలో నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం రెండో రోజు కొనసాగింది. ఈ దీక్షకు బీజేపీ పట్టణ నాయకులు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. దీక్షలో ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజుమాదిగ, బీజేపీ నాయకులు జల్లా జనార్దన్‌రావు, వంగాల పిచ్చయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రాము, సత్యరాజు, చిన్న వెంకట్రావ్, సూర్యప్రకాశ్, జాను పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంజమూరి మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో నాయకులు పున్నయ్య, చంద్రయ్య, దోరేపల్లి వెంకటేశ్వర్లు, పల్లెపంగు నాగరాజు, ఇంజమూరి వెంకన్న, శంకర్, ఉపేందర్, నాగరాజు, శ్రీను, అబ్రహం, వీరబాబు, మట్టయ్య, శేఖర్, లింగయ్య తదితరులున్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని దీక్ష

మునగాల : ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల శాఖల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, లంజేపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షను మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదరిశ కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు మాదిగ, మండల నాయకులు గద్దల అశోక్, జిల్లేపల్లి సైదులు, చిర్రా గణేష్, సూరి, వీరబాబు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ దీక్షలలో నాయకులు చింతిరాల నాగయ్య, బచ్చలకూరి ప్రసాద్, ఒగ్గు విశాఖ, మీసాల శరత్, జి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వర్లు, బి.రవీందర్, మట్టపల్లి ఉన్నారు.

కల్వర్టు నిర్మాణంలో నాణ్యత లోపం



అమీనాబాద్ వద్ద ఇసుక లేకుండా రాక్ డస్ట్‌తో నిర్మిస్తున్న కల్వర్టు

అనంతగిరి : మండలంలోని అమీనాబాద్ నుంచి నడిగూడెం మండల కేంద్రం వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు పనులు సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదు. అమీనాబాద్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణంలో గురువారం కంకర, సిమెంటు, డస్ట్ మాత్రమే ఉపయోగిస్తూ పనులు చేపట్టారు. ఇసుక తప్పనిసరిగా వాడాల్సిందేనని ఉన్నతాధికారులు చెప్పినా.. సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకుండా పనులు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాణ్యత లేకుండా కల్వర్టు నిర్మిస్తున్నట్లు అధికారులు దృష్టికి వెళ్లగానే ట్రాక్టర్‌తో అప్పటికప్పుడు నాణ్యతలేని ఇసుకను తెప్పించడం గమనార్హం.

ఆర్‌అండ్‌బీ డీఈ పవన్‌కుమార్ వివరణ..

ఇసుక లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని సదరు కాంట్రాక్టర్‌ను హెచ్చరించినట్లు, కల్వర్టు నిర్మాణంలో 50శాతం ఇసుక మరో 50శాతం డస్ట్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపాం. కాంట్రాక్టర్ ఖచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



హుజూర్‌నగర్ : అన్నదానం చేస్తున్న తెలంగాణ జాగృతి నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు చేయించి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు ఎస్‌కే మస్తాన్, కె.గోవర్ధన్, సుధాకర్, డి.లక్ష్మణ్, పి.భారతి, హుస్సైనమ్మ, ములకలపల్లి రాంబాబు, నర్సింహరావు, రాజేష్, నాగేశ్వర్, శంకరాచారి, వేణు, భిక్షం, నాగార్జున, శ్రీను, వెంకటేష్, ప్రభాకర్, వీరస్వామి, పన్నీరు, యాకయ్య, నజీర్, రవీందర్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను గురువారం చింతలపాలెంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోర్తాల వెంకటరెడ్డి, వి.వెంకట్‌గౌడ్, మోర్తాల నాగిరెడ్డి, టి.మహత్యం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శివ పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండలంలోని అశోక్‌నగర్‌లో గల మానసిక దివ్యాంగుల కేంద్రంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిలా నాయకులు మస్తాన్, లక్ష్మణ్, నాగశేఖర్, శంకరాచారి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి



కోదాడరూరల్ : మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మునగాల : జయంతి వేడుకల్లో పాల్గొన్న శాలివాహన వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



నేరేడుచర్లలో మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఐ, నాయకులు



చిలుకూరులో నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘం నాయకులు

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం క్రాస్‌రోడ్డులో గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను శాలివాహన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సిరికొండ చందు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రజాపతి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే జయంతి నాటికి మండల కేంద్రంలో మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మడిపడుగు వెంకన్న, సంఘం ఉపాధ్యక్షులు గొట్టిపర్తి సైదులు, సిరికొండ నాగేశ్వరరావు, కోదాటి శ్రీను, ప్రధాన కార్యదర్శి పాలబిందెల నర్సింహారావు, సహాయ కార్యదర్శి సిరికొండ రామకృష్ణ, యువజన సంఘం కార్యదర్శి సిరికొండ నవీన్, శాలివాహన సంఘం పెద్దలు పాల్గొన్నారు.

మొల్లమాంబ జీవితం ఆదర్శం

కోదాడరూరల్ : కవయిత్రి మొల్లమాంబ జీవితం ఎందరికో ఆదర్శమని మొల్లమాంబ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి రామారావు అన్నారు. గురువారం పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో మొల్లబాంబ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్వరలోనే పట్టణంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో చలిగంటి రామారావు, లక్ష్మణ్‌రావు, మురళీ, దామోదర్, ప్రసాద్, వెంకట్, సూర్యనారాయణ, రంగా, నాగరాజు, పాపారావు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

నేరేడుచర్ల : తొలి మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతిని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గరిడేపల్లి ఎస్ఐ చలిగంటి నరేష్, నాగేశ్వర్‌రావు, మహేష్, ప్రేమ్‌కుమార్, మధు, సుధాకర్, మల్లయ్య, లీల, శ్రీను, అంజి, నాగార్జున, ప్రసాద్, ప్రశాంత్ తదితరులున్నారు.

చిలుకూరు : మండలం కేంద్రంతో పాటు మండలంలోని బేతవోలు గ్రామాల్లో గురువారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి శ్రీమొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం నాయకులు చిలువేరు అంజనేయులు, కడారు మధు, నరసింహారావు, అనిల్, నరసయ్య, లక్ష్మయ్య, పరుశురాం, నరేష్, వెంకటేష్, వెంకటేశ్వర్లు, శ్రీను, నరసింహరావు, కోటయ్య, అవినాష్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలో పాల్గొన్న చైర్మన్ దంపతులు, భక్తులు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో గల రుక్మిణి సత్యభామ గోదాదేవి సమేత సంతాన వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా 9కళశాలలో పంచామృతాలు, నదీజలాలు, సుగంధ ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ధర్మకర్తలు యాదా రమేష్–విజయలక్ష్మి, యాదా శ్రీనివాసరావు–జ్యోతి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు సంధ్య దంపతులు, అర్చకులు నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణాచార్యులు, విష్ణువర్ధనాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయడం సరికాదు

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సభ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపాలపురంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల పక్షాన గొంతు ఎత్తి మాట్లాడిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సభను నుంచి సస్పెండ్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థకు, చేతగాని తనానికి నిదర్శమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల : పట్టణంలో 14, 15వతేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం తెలిపారు. 33కేవీ గరిడేపల్లి ఫీడర్‌లో మరమ్మతులతో పాటు మున్సిపాలిటీలోని జాన్‌పహాడ్ రోడ్డులో నాలుగు పోల్స్‌ను షిఫ్టింగ్ చేయనున్న నేపథ్యంలో నేరేడుచర్ల పట్టణంతో పాటు ముకుందాపురం, తెలగరామయ్యగూడెం 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు వరుసగా రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 11.25నిలకు స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కృష్ణవేణికి సత్కారం

మేళ్లచెరువు : మండల కేంద్రానికి చెందిన పసుపులేటి కృష్ణవేణి జాతీయ స్థాయిలో కబడ్డీ క్రీడాకారిణిగా రాణిస్తూ ఇటీవల స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించింది. కాగా కృష్ణవేణి మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్‌స్కూల్‌లో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణత సాధించి రైల్వేలో ఉద్యోగం సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆమెను గురువారం ఎంఈఓ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురంలో గురువారం యూత్ కాంగ్రెస్ సమావేశాన్ని మండల అధ్యక్షుడు గుండు మహేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందుల గోపి, ప్రధాన కార్యదర్శిగా నేలమర్రి నవీన్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రవేశపరీక్ష గడువు పొడిగింపు

మునగాల : తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రవేశానికి పరీక్ష గడువును పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్ గురువారం తెలిపారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరో తరగతిలో 100సీట్లు, ఏడు నుంచి పదితరగతుల్లో ఏర్పడిన ఖాళీలను ఈ ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవిలో జాగ్రత్తలపై అవగాహన సదస్సు

మునగాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయి అధికారుల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్.రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. ప్రజలు ఉదయం 11గంటల లోపు, సాయింత్రం 4గంటల తర్వాత పనికి వెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ప్రొఫెషనరీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, రేపాల పీహెచ్‌సీ హెచ్‌ఈఓ బి.భాస్కర్‌రాజు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గరిడేపల్లి : వేసవిలో వడదెబ్బ గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయి అధికారులు టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్ ప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.నరేష్ మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ కవిత, సీహెచ్‌ఓ నరసింహ, ఎంఎల్‌హెచ్‌పీ అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

21న బొడ్రాయి వార్షికోత్సవం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ఈ నెల 21న బొడ్రాయి (నాభిశిల) 7వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక బొడ్రాయి వద్ద నిర్వహించిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో కమిటీ సభ్యులు అవుల రామారావు, పైడిమర్రి వెంకటనారాయణ, సట్టు నాగేశ్వరరావు, గంధం రంగయ్య, వేముల రాముడు, పాండు, లింగయ్య, నాగయ్య, శ్రీను, వెంకటేశ్వరరావు ఉన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేస్తామని విద్యుత్ జిల్లా స్పెషల్ స్క్వాడ్, విజిలెన్స్ డీఈ కె.స్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపాలపురం, హుజూర్‌నగర్ పట్టణ శివారులో గల ఇటుక బట్టీల్లో విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ ఏఈ రమాదేవితో కలిసి అకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఆయన వెంట విజిలెన్స్ సిబ్బంది ఉపేందర్, బ్రమ్మారెడ్డి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నేరేడుచర్ల : మండల కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించే భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కోరారు. గురువారం పట్టణంలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వాస కరుణాకర్, వాస పల్లయ్య, సత్యమ్మ, భిక్షం, హుస్సేన్, లక్ష్మి, పావని, భగత్‌సింగ్ కమిటీ నాయకులు శ్రీను, కోటయ్య, రజాక్, సైదులు, రంగయ్య, మరియమ్మ, మల్లేశ్వరీ, మౌలాంబి, ఫాతిమా, దుర్గమ్మ, లక్ష్మమ్మ, మంగమ్మ తదితరులున్నారు.

లేబర్‌కార్డులు అందజేయాలి

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌కార్డులు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్లమల్కాపురంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు గురుస్వామి, లక్ష్మయ్య, కళ్యాణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి పి.సతీష్‌కుమార్ కోరారు. గురువారం మండల పరిధిలోని కరివిరాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం కూలీల హాజరు పత్రాలు, నర్సరీలను పరిశీలించారు. అదే విధంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అన్వర్ తదితరులున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు

కోదాడరూరల్ : పట్టణంలోని నయానగర్ 17వ వార్డులో గల కిడ్జ్ పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు మాజీ కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు మాట్లాడారు. పాఠశాల యాజమాన్యం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు గులాం, సిబ్బంది ఉన్నారు.